క్లుప్తంగా

రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రాజమౌళి

భీమారం: రోడ్డు భద్రతపై ఆర్టీసీ అధికారులు మంగళవారం భీమారం మండల కేంద్రంలోని బస్టాప్ వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు మంచిర్యాల ఆర్టీసీ స్టేఫ్టీ వార్డెన్ రాజమౌళి మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఎంతో సురక్షితమైనదన్నారు. బైక్‌లు, ఇతర వాహనాలతో ఆర్టీసీ బస్సులను ఓవర్‌టేక్ చేసే సమయంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బస్టాప్‌లో బస్సుల కోసం ఎదురుచూడకుండా, ఆర్టీసీ ప్రవేశపెట్టిన గమ్యం యాప్ ఇన్‌స్టాల్ చేసుకొని దాని ద్వారా బస్సుల రాకపోకలను తెలుసుకోవాలని కోరారు.

18న కాసిపేట మండల సమావేశం

కాసిపేట: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 18న ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గౌరవ సభ్యులు సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరారు. సంబంధిత శాఖల అధికారులు తమ పూర్తి నివేదికలతో హాజరు కావాలన్నారు.

ఉపాధిహామీపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి

వేమనపల్లి: ఉపాధిహామీ పనులకు వెళ్లే కూలీలకు రూ.300 గరిష్ఠ కూలీ వేతనం అందేలా సిబ్బంది అవగాహన కల్పించాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కూలీలకు నీడ కల్పించాలన్నారు. నర్సరీ పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ బాపురావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రవీణ్, ఏపీఓ సత్యప్రసాద్, ఏఈ నరేష్, ఈసీ మదుకర్ పాల్గొన్నారు.

హాజీపూర్ మండల సమావేశం వాయిదా



వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీపీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. హాజీపూర్ మండల పరిషత్(ఎంపీపీ) కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరగాల్సిన సమావేశానికి 9 మంది ఎంపీటీసీలకు గాను ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. హాజీపూర్ ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, ఎంపీడీఓ మధుసూధన్‌తో పాటు పలువురు మండల అధికారులు హాజరయ్యారు. ఇక సర్పంచుల పదవీ కాలం పూర్తి కావడంతో ఎంపీటీసీలతో ఏర్పాటు చేసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి 7 గురు ఎంపీటీసీలు గైర్హాజరు కావడంతో సమావేశ నిర్వహణకు కోరం లేకపోయింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో కూడా సమావేశం వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

నీటి సమస్య లేకుండా చూడాలి



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

వేమనపల్లి: గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ బాపురావు అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్‌తో కలిసి మంగళవారం నీల్వాయి, కొత్తగూడం, మామడ, ముల్కలపేట, రాచర్ల, ఎస్టీ కాలనీలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను పరిశీలించారు. పైపులైన్ లీకేజీలు, పంపుసెట్లు, బోర్‌వెల్స్ చెడిపోయి ఉంటే రిపేర్ చేయించాలని కార్యదర్శికి సూచించారు. గ్రామాల్లో మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆయన వెంట ఏఈ నరేష్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సెంట్రల్ లైటింగ్ వెలగట్లే..!



మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిలోని భీమారం వద్ద సుమారు రూ.50లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ అలంకారప్రాయంగా మారుతున్నాయి. కొన్ని రోజులుగా లైట్లు వెలగకపోవడంతో జాతీయ రహదారి చీకటిమయంగా మారుతోంది. దీంతో ప్రయాణికులు కష్టాలు పడుతున్నారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకొని సెంట్రల్ లైటింగ్ పనిచేసేలా చూడాలని కోరుతున్నారు.

– భీమారం

వంగిన స్తంభం..!

దండేపల్లి మండలంలోని వెంకటాపూర్ నుంచి తానిమడుగు వెళ్లే రోడ్డు పక్కన పంట పొలాల్లో విద్యుత్ స్తంభం వంగి పడిపోయేలా ఉంది. అయినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి వంగిన స్తంభాన్ని సరిచేయాలని కోరుతున్నారు.

– దండేపల్లి



చెట్ల కొమ్మలు తొలగించండి..!



భీమారం మండల కేంద్రం నుంచి కొత్తపల్లి వరకు ప్రధాన రహదారిలో పలుచోట్ల తుమ్మచెట్ల కొమ్మలు రోడ్డుని ఆక్రమిస్తున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైన రోడ్డును ఆక్రమిస్తున్న చెట్ల కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

– భీమారం

ముస్తాబైన రామాలయాలు



వేంపల్లిలో విద్యుద్దీపాల వెలుగుల్లో ఆలయం

శ్రీరామనవమి వేడుకలకు జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. పాలపారకతో పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఎదుర్కోళ్ల కార్యక్రమంతో ఉత్సవాలు మొదలయ్యాయి.

మందమర్రిలో...



ఎదుర్కోలు కార్యక్రమంలో ప్రత్యేక పూజ

మందమర్రిరూరల్: పట్టణంలోని పలు ఆలయాల్లో నేడు సీతారామ కల్యాణ ఉత్సవాలు నిర్వహించడానికి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. మూడో జోన్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో కల్యాణానికి ఆలయ అర్చకులు వెంకటేశ్వరచారి, ఆలయ కమిటీ కేకే–5 గని సంక్షేమాధికారి కార్తీక్ ఏర్పాట్లను పరిశీలించారు. పాలచెట్టు సమీపంలోని శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి ఆలయ అర్చకులు కృష్ణకాంతాచారి ఆధ్వర్యంలో నిర్వహించే కల్యాణానికి ఎంవీటీసీ పక్కన స్థలంలో ఏర్పాట్లు చేశారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఇంటి వద్ద ఎదుర్కోలు కార్యక్రమంతో కల్యాణ కార్యక్రమంలో శోభ సంతరించుకుంది.

తాండూర్‌లో...



తాండూర్: మండలం మాదారం టౌన్‌షిప్‌లోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కల్యాణ మండపాన్ని అలంకరణ చేసి, భక్తులకు అసౌకర్యం కలగకుండా సౌకర్యాలు కల్పించారు. సీతారాముల కల్యాణ వేడుకల్లో భాగంగా భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఎదుర్కోలు నిర్వహించారు.

భీమారంలో...

భీమారం: మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయం సీతారాముల కల్యాణోత్సవానికి ముస్తాబైంది. ఆలయాన్ని రంగురంగుల దీపాలతో అలంకరించారు. 11.51 గంటలకు వివాహం జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. భీమారం మండలంతో పాటు చెన్నూర్, శ్రీరాంపూర్, మంచిర్యాల ప్రాంతాల నుంచి భక్తులు రానున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.



భీమారంలోని శ్రీకోదండరామాలయం

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి: శ్రీకోదండరామాలయంలో సీతా రాముల కల్యాణ వేడుకలు జరగనున్నాయి. ఉదయం 11–30 గంటలకు సీతారాముల వివాహ తంతును నిర్వహించనున్నారు. ఇందుకు శ్రీకోదండ రామాలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. వేడుకలకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై సీతారాములకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు అందజేయనున్నారు.

కాసిపేటలో...

కాసిపేట: మండలంలో బుధవారం నిర్వహించే సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. దర్మరావుపేట, సల్పలవాగు, సోమగూడం గ్రామాల్లో ముందస్తుగా తోరణాలు, టెంట్లు వేసి అన్ని సౌకర్యాలు కల్పించారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు గ్రామమైన ధర్మరావుపేటలో కల్యాణానికి ఏర్పాట్లు చేయడంతో అధిక సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు.

జన్నారంలో...



జన్నారం: రేండ్లగూడా రామాలయం

జన్నారం: సీతారాముల కల్యాణ మహోత్సవానికి రామాలయాలు ముస్తాబయ్యాయి. జన్నారం మండలంలోని పొనకల్ శ్రీరామచంద్రాలయం, రేండ్లగూడలోని శ్రీ సీతారామాలయం, కలమడుగులోని శ్రీరామాలయం ముస్తాబు చేశారు. కలమడుగులో సీతారాముల కల్యాణ మహోత్సవానికి పచ్చని పొరకను భాజభజంత్రీలతో ఎదుర్కొని ఆలయంలో ముందు ఏర్పాటు చేసిన పందిరిపై వేశారు. కనుల పండువగా సీతారాముల కల్యాణం జరుపడానికి ఆలయ కమిటీలు తగిన ఏర్పాట్లు చేశాయి.

దండేపల్లిలో...

దండేపల్లి: శ్రీరామ నవమిని పురస్కరించుకుని దండేపల్లి మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో బుధవారం జరిగే సీతారాముల కల్యాణానికి మంగళవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. హనుమాన్ ఆలయాల వద్ద నిర్వహించే సీతారాముల కల్యాణానికి వేదికలను సిద్ధం చేశారు. ఆలయాలను ముస్తాబు చేశారు. దీంతో పెళ్లి వేడుకల సందడి మొదలయ్యింది.

హాజీపూర్‌లో...

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శ్రీరామనవమి పర్వదిన మహోత్సవాన్ని పురస్కరించుకుని హాజీపూర్ మండలంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలను మామిడి తోరణాలతో, కాషాయ జెండాలతో, విద్యుత్ దీపాలతో అలంకరించగా సీతారాముల కల్యాణానికి గాను పెద్దపెద్ద షామియానాలు, చలువ పందిర్లు ఏర్పాటు చేశారు.

పెళ్లికి పాలపారక



గూడెంలో పాలపారక తీసుకొస్తున్న భక్తులు

దండేపల్లి: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా బుధవారం జరిగే సీతారాముల కల్యాణ వేడుకల్లో భాగంగా మంగళవారం పలు గ్రామాల్లో పాల పారక(పచ్చని పందరి) వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. ఎడ్లబండ్లలో పచ్చని పాలపారక తెచ్చి ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన పందిళ్లపై వేశారు.

శాంతి హోమం నిర్వహణ



హోమంలో పాల్గొన్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆర్‌కే 6 గనిలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శాంతి హోమం నిర్వహించారు. గని మేనేజర్ తిరుపతి దంపతులతో మంగళవారం శాంతి హోమం నిర్వహించారు. కార్యక్రమానికి ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఆర్‌కే 5, 6 గనుల గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, గుర్తింపు సంఘం నాయకులు సీతారామయ్య, ముస్కె సమ్మయ్య, బాజీసైదా, సంఘం సదానందం తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాల దుష్పరిణామాలపై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ, ఎస్సైలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి టూటౌన్ పరిధిలో మంగళవారం పోలీసులు మత్తుపదార్థాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించడానికి ప్రత్యేకంగా తయారు చేసిన పోస్టర్లను విడుదల చేశారు. టూటౌన్ ఎస్సై రమేష్ స్థానికులతో కలిసి బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలుద్దిన్ పోస్టర్లను ఆవిష్కరించారు. స్వయంగా రైల్వేస్టేషన్ ఏరియాలో గోడలపై పోస్టర్లను అంటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి, కల్తీకల్లుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాణాంతకమైన పదార్థాలు కలిపి తయారు చేసే కల్తీకల్లుకు బానిస కావద్దన్నారు. గంజాయిని తాగే అలవాటు ఉన్న యువకులు వెంటనే మానుకోవాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణా, అమ్మకం, కొనుగోలు దారులపై నిఘా ఉంచామని, పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై నర్సయ్య, స్థానికులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ నూతన కార్యవర్గం

నస్పూర్: ఆర్‌కే న్యూటెక్ సీఐటీయూ నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. శ్రీరాంపూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆర్‌కే న్యూటెక్ పిట్ కార్యదర్శిగా పెరుక సధానందం, బీ రిలే బాధ్యులు అంకం రాజేశ్, జనరల్ మజ్దూర్ బాధ్యులు బోడ రాంజీ, పిట్ అడ్వైజర్‌గా చిగురి లక్ష్మణ్, షిఫ్ట్ ఇన్‌చార్జులుగా బట్టు సురేందర్, దామెర తిరుపతి, పోతు వెంకటేశ్, తిరుపతిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బాలాజీ, శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా ప్లేట్లు పంపిణీ



ప్లేట్లు అందజేస్తున్న అటవీశాఖ అధికారులు

జైపూర్: మండలంలోని కుందారం ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కాగజ్‌నగర్ డివిజినల్ మేనేజర్ శ్రావణి ఆధ్వర్యంలో ఉచితంగా ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థుల మధ్యాహ్నం భోజన కోసం సొంత ఖర్చులతో డివిజనల్స్ మేనేజర్ శ్రావణి ప్లేట్స్ అందించారు. భవిషత్‌లో పాఠశాల అభివృద్ధికి మరింతగా తోడ్పాటు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల, బెల్లంపల్లి రేంజ్‌ల ప్లాంటేషన్ మేనేజర్లు సురేశ్‌కుమార్, సునీత, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు స్వరూప రాణి, శోభ, సుజాత, లక్ష్మణ్‌రావు, లక్ష్మణ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ పెరిగితే చర్యలు తప్పవు



డీజే యజమానులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

వేమనపల్లి: శుభకార్యాలు, ఇతర ఫంక్షన్‌లలో డీజేలు ఏర్పాటు చేసే యజమానులు, ఆపరేటర్లు ఎక్కువ సౌండ్ పెడితే చర్యలు తప్పవని నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ వద్ద డీజే యజమానులు, ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. 60 నుంచి 80 డిసిబుల్స్ మధ్యలో సౌండ్ పెట్టుకోవాలని, అంతకు మించి పెట్టొద్దని, అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఆపరేటర్లు, యజమానులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై అమానుల్లాఖాన్ పాల్గొన్నారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం

రామకృష్ణాపూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ నాయకులు మంగళవారం పట్టణంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. కేంద్రంలో నరేంద్ర మోదీ హయాంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్, మాసు సత్యనారాయణ, మోహన్, శ్రీనివాస్, శ్రీలత పాల్గొన్నారు.

జిలేబీ పంపిణీ

చెన్నూర్: పట్టణంలోని ప్రతాప్ మారుతి మందిర్ వద్ద మంగళవారం హనుమాన్ దీక్ష పరులకు బ్రదర్స్ ఇంజనీయరింగ్ యజమాని ఖాలీల్ జిలేబీ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కారెంగుల రామయ్య, మామిడి బాపు, మేకల రామస్వామి, నడిపల్లి లక్ష్మణ్‌రావులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో 'సీతారామ కల్యాణం' రచన



కలెక్టర్‌కు పుస్తకం అందజేస్తున్న శ్రీదేవి

బెల్లంపల్లి: ఆమె ఓ ప్రభుత్వ శాఖ అధికారిణి. చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక భావాలు అణువణువునా పుణికి పుచ్చుకున్న ఆ అధికారిణికి పుస్తక పఠనం, కవితలు చదవడం, రచనలు చేయడంలో అమితమైన ఆసక్తి. తాతల, తండ్రుల తరం నుంచి వంశ పారంపర్యంగా అబ్బిన రచనను తనవంతుగా కొనసాగించి ప్రత్యేకతను ఏర్పర్చుకుంది. ఆమె మరెవరో కాదు బెల్లంపల్లికి చెందిన మంచిర్యాల జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ యర్ర.శ్రీదేవి. కరీంనగర్ జిల్లా జూలపల్లి గ్రామంలో జన్మించిన శ్రీదేవికి బెల్లంపల్లి వాసి యర్ర శ్రీధర్ రాజుతో వివాహం జరిగింది. వీరికి శ్రీరంగనాథ రాజు, శ్రీనాథరాజు, సాయినాథరాజు కుమారులు. కొడుకులు ముగ్గురు ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కాగా, శ్రీదేవి సహకారశాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగం చేస్తున్నారు. భర్త శ్రీధర్ రాజు బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ గురుకుల పాఠశాల (టీఎస్ఆర్ఎస్)లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి కొన్నాళ్ల క్రితం అకాల మృతి చెందారు. తెలుగు భాషపై మంచి పట్టున్న శ్రీదేవి ఏదైనా కవితా రచన చేయాలని సంకల్పించారు. ఈ మేరకు పట్టుదలతో 'శ్రీ సీతారామ కల్యాణం' పంచ పదులు కవితా రచన చేసి తన మనస్సులోని కోరికను నెరవేర్చుకున్నారు. వందల సంఖ్యలో కవితలు రచించారు.

తొలి సంచిక శ్రీ సీతారాముల చెంతన...

భక్తి భావం మెండుగా ఉన్న శ్రీదేవి శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలకు ముందస్తుగా తాను రచించిన 'శ్రీ సీతారాముల కల్యాణం' పంచ పదుల పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలి సంచికను భద్రాచలం వెళ్లి ప్రత్యేక పూజలు చేసి జానకి రాముల చెంతన ఉంచి తన భక్తి భావాన్నీ చాటుకున్నారు. పుట్టపర్తి వెళ్లి సత్యసాయి బాబా సన్నిధిలోనూ పుస్తకాన్ని ఉంచారు. ఇటీవల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌కు కవితా రచన పుస్తకాన్నీ అందజేసి ఇన్నాళ్లు తనలో అంతర్లీనంగా ఉన్న కవితా రచనను బహిర్గతం చేసి అబ్బురపర్చారు. ఎంతో పట్టుదలతో, మరెంతో భక్తి భావంతో శ్రీ సీతారాముల కల్యాణం పంచపదుల కవితా రచన చేసిన శ్రీదేవిని పలువురు ప్రత్యేకంగా అభినందించి సత్కారం చేశారు. మరెన్నో రచనలు చేయాలని ఆకాంక్షించారు.

మసీద్ కమిటీ అధ్యక్షుడిగా యూసుఫ్

జైపూర్: మండలంలోని ఇందారం జామ మసీద్ కమిటీకి మంగళవారం ఎన్నికలు నిర్వహించగా 89ఓట్లతో ఇందారం గ్రామానికి చెందిన మహ్మద్ యూసుఫ్ అధ్యక్షుడిగా ఎన్నిక కాగా, ఉపాధ్యక్షుడిగా సయ్యాద్ అన్వర్, జనరల్ సెక్రెటరీగా మహ్మద్ జహీరుద్దీన్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ అధ్యక్షులకు, కమిటీకి స్థానిక హిందూ, ముస్లిం సోదరులు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింల సమస్యలు, వారి అభివృద్ధి కోసం కమిటీ పనిచేయనున్నట్లు తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు కీలకం

- బాధ్యతగా పనిచేయాలని ఉన్నతాధికారుల సూచన

బెల్లంపల్లిరూరల్/కాసిపేట/భీమిని/చెన్నూర్‌రూరల్/మందమర్రిరూరల్/భీమారం/దండేపల్లి/జైపూర్/చెన్నూర్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతీ గృహాల నిర్వహణలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులే కీలకమని ఉన్నతాధికారులు సూచించారు. కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేయాలని మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో మంగళవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు పలు అంశాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్నింటినీ సమకూర్చేందుకు ప్రత్యేక కృషి చేయాలని, విద్యార్థులు చదువులో ఉన్నతంగా రాణించేందుకు చొరవ తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో చేపట్టాల్సిన అభివృద్ధి, అత్యవసర పనులు, కమిటీ చైర్‌పర్సన్‌లు, కమిటీ సభ్యుల బాధ్యతలపై క్షుణ్ణంగా వివరించి అవగాహన కల్పించారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ పనులు ఉంటే వేసవి సెలవుల్లో పూర్తి చేయించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల్లో ఐకేపీ వీవోలు కమిటీ చైర్‌పర్సన్‌గా, పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కమిటీ సభ్యులుగా ఉండనున్నట్లు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో చెన్నూర్‌లో ఎంఈవో రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, ఏఈ సాయికిరణ్, బెల్లంపల్లిలో ఎంపీడీవో మహేందర్, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, ఐకేపీ ఏపీఎం శ్యామల, అమ్మ ఆదర్శ పాఠశాల రిసోర్స్ పర్సన్ అఫ్జల్, ఇన్‌చార్జి ఏ.ఈ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాసిపేటలో నోడల్ అధికారి రాథోడ్ రమేష్, ఏఈ సాయికృష్ణ, ఎంపీఓ నాగరాజు, ఏపీఎం వెంకటేశ్వర్లు, చెన్నూర్‌లో ఎంపీడీవో మోహన్, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, ఎంపీవో అజ్మత్‌అలీ పాల్గొన్నారు. భీమినిలో ఎంపీడీఓ గంగా మోహన్, ఎంపీఓ సబ్దర్‌ఆలీ, మందమర్రిలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో భీరయ్య పాల్గొన్నారు. భీమారంలో ఎంపీడీవో రాధారాథోడ్, జైపూర్ ఎంపీడీవో సత్యనారాయణ, దండేపల్లిలో ఎంఈవో రవీందర్, ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో శ్రీనివాస్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఐకేపీ వీవోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.